క్లుప్తంగా

పచ్చదనం పెంపొందిద్దాం


మొక్కలు నాటుతున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వందరోజుల్లో 100 మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని జేసీఐ అధ్యక్షురాలు బెందాళం వరలక్ష్మి తెలిపారు. శాంతినగర్ కాలనీలోని గాంధీ స్మృతి వనంలో బుధవారం జేసీఐ గ్రీన్‌సిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడితే భావితరాలకు మనుగడ ఉంటుందన్నారు. జేసీఐ సెనేటర్ జామి భీమశంకర్, లయన్స్‌క్లబ్ సెంట్రల్ శ్రీకాకుళం అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపకులు హారిక ప్రసాద్, జోనల్ చైర్మన్ నటుకుల మోహన్, మారుతీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన మురళీధర్, పాలిశెట్టి మధుబాబు, గ్రీన్‌సిటీ పూర్వపు అధ్యక్షుడు మణిశర్మ, ఎస్.విజయలక్ష్మి, ఎస్.జోగినాయుడు, కొంక్యాన వేణుగోపాల్, గణపతి పట్నాయక్, జేసీఐ సెక్రటరీ సూర్య, ట్రెజరర్ లక్ష్మణ్, అనిల్, శాస్త్రి పాల్గొన్నారు.

రీసర్వే సద్వినియోగం చేసుకోవాలి


భూముల వివరాలు తెలియజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: జగనన్న శాశ్వత భూ హక్కును భూమి ఉన్న యజమానులు సద్వినియోగం చేసుకోవాలని మండల సర్వేయర్ సుభాష్ తెలిపారు. కుశాలపురంలో భూ సర్వే గ్రామసభ బుధవారం నిర్వహించారు. భూమి ఉన్న ప్రతి రైతు సర్వే చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న హద్దురాలు వేసుకోవాలని కోరారు. ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వీఆర్వో శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ వెంకటరావు, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగిన 37వ సౌత్ జోన్ యువభేరి కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున బృందం పాల్గొంది. పలు అంశాల్లో పాల్గొని బహుమతులు, పతకాలు సాధించారు. ఈ విద్యార్థులకు వర్సిటీలో బుధవారం వీసీ నిమ్మ వెంకటరావు, రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య, అధికారులు అభినందించారు.

క్రికెట్ విజేత కాకిపాలెం


క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీటీసీ రెడ్డి వాసు

రణస్థలం: సంక్రాంతి సందర్భంగా కొండములగాం గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి వాసు ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీల్లో కాకిపాలెం గ్రామ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా కమ్మసిగడాం జట్టు నిలిచింది. ఈ జట్లుకు నగదు పురస్కారంతోపాటు బహుమతులను ఎంపీటీసీ అందజేశారు. కమ్మసిగడాం వైఎస్సార్‌సీపీ నాయకుడు సింక రాము తదితరులు ఉన్నారు.

వైభవంగా పైడితల్లి జాతర


పూజలు అందుకుంటున్న పైడితల్లి అమ్మవారు

జి.సిగడాం: గెడ్డకంచరాంలో పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 16 నుంచి ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. స్థానిక ఎస్‌ఐ సామంతుల రామారావు ఆధ్వర్యంలో భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. సుదూరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. వినోద కార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి ముడుపులు, మొక్కులు తీర్చుకున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలు గురువారంతో ముగుస్తాయన్నారు.

ఆహ్లాదం.. ఆధునికం!

- సర్కారు బడి..సరికొత్త ఒరవడి
- నాడు–నేడుతో సమూల మార్పులు
- పూర్తిస్థాయిలో మౌలిక వసతులు


ఎచ్చెర్ల ఉన్నత పాఠశాలలో ఆధునీకీరరించిన భవనాలు


నా పేరు టి.లావణ్య, ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. గతంతో పోల్చుకుంటే నాలుగేళ్లలో మా పాఠశాలలో అనేక మార్పులు వచ్చాయి. నాడు–నేడు కింద పూర్తిస్థాయిలో పాఠశాల అభివృద్ధి చెందింది. పక్కా భవనాలు, బెంచీలు, డిజిటల్ స్మార్ట్ బోర్డులు, మెరుగైన విద్యాబోధన, రన్నింగ్ వాటర్ సౌకర్యం గల టాయిలెట్లు ఇలా అనేక సౌకర్యాలు కల్పించారు. విద్యా రంగంలో జగన్ మామయ్య పాలన స్వర్ణయుగంగా చెప్పవచ్చు.



ఎచ్చెర్ల క్యాంపస్: మనబడి నాడు–నేడు పథకం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చివేసింది. పేద విద్యార్థులకు కార్పొరేట్‌కు దీటైన విద్య అందించాలన్న ఉద్దేశంతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడులపై ప్రత్యేక దృష్టి సారించారు. టైల్స్, బెంచీలు, స్మార్ట్ బోర్డులు, రన్నింగ్ నీటి సౌకర్యంగల టాయిలెట్లు ఇలా అనేక వసతులతో కూడిన పక్కా భవనాలు నిర్మించారు. విద్యార్థులను ఆకర్షించేలా బడులను తీర్చిదిద్దారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇంగ్లీష్ మీడియం విద్య అందిస్తూ నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన సాగిస్తున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలం	ఎచ్చెర్ల
పాఠశాలలు	103
ఉపాధ్యాయుల సంఖ్య	502
నాడు–నేడు పాఠశాలలు	71
మంజూరైన నిధులు	రూ.79 కోట్లు
పనులు పూర్తయిన స్కూళ్లు	38
పనులు కొనసాగుతున్నవి	33

“ బడి భేష్..


విద్యా సంస్థ అంటే ఎలా ఉండాలో అలా తీర్చిదిద్దారు. తాగు నీరు, టాయిలెట్లు, స్మార్ట్ బోర్డులు ఇలా అనేక విధాలుగా పాఠశాలను బాగు చేశారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన వసతులు కల్పించారు.

– మెండ బాలకృష్ణ, 10వ తరగతి విద్యార్థి, ఎచ్చెర్ల ఉన్నత పాఠశాల

“ ఆహ్లాదంగా ఉంది..


ఆహ్లాదకర వాతావరణంతో పాఠశాల ఆకట్టుకుంటోంది. ఒక్కరోజు కూడా మానకుండా బడికి వస్తున్నాం. ఆధునిక సౌకర్యాలు, అత్యుత్తమ బోధన అందిస్తున్న ఇటువంటి పాఠశాలల్లో చదవడం ఆనందంగా ఉంది.

– నేతింటి కృష్ణంరాజు, 10వ తరగతి విద్యార్థి, ఎచ్చెర్ల ఉన్నత పాఠశాల


క్లాస్ వర్కు


డిజటల్ స్మార్ట్ బోర్డుపై బోధన

భక్తితో గణపతి హోమం


ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి


గణపతి హోమం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళం ధర్మశాస్తా దేవాలయంలోని అయ్యప్పస్వామి ఆలయంలో గణపతి హోమాన్ని బుధవారం నిర్వహించారు. అలాగే స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు వల్లభనారాయణస్వామి రథోత్సవం


వల్లభ నారాయణస్వామి

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని నైరా గ్రామంలో వెలసిన వల్లభ నారాయణ స్వామి రథోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు స్థానిక సర్పంచ్ అరవల రామ్‌ప్రతాప్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి పంచామృత అభిషేకం మొదలుకొని స్వామివారి నిజరూప దర్శనంతో పాటు ఆరు గంటలు సర్వదర్శనాలు ఉంటాయన్నారు.

పేదలకు దుస్తుల వితరణ


దుస్తులు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు


కోష్టలో పేదలకు దుస్తులు అందజేస్తున్న పిషిణి లక్ష్మంనాయుడు

రణస్థలం: సంక్రాంతిని పురస్కరించుకుని జే.ఆర్.పురం పంచాయతీలోని సీతంవలస గ్రామంలోని పలువురు పేదలకు వైఎస్సార్‌సీపీ వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. అలాగే కోష్టలో పేదలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు షిషిణి లక్ష్మంనాయుడు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల నాయకులు, పెద్దలు, యువత పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి యాత్ర


పూజలు అందుకుంటున్న దుర్గాదేవి

జి.సిగడాం: మధుపాంలో దుర్గాదేవి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా ముక్కనుమ రోజున ఈ ఉత్సవాలు ప్రారంభించి మూడు రోజులపాటు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశామన్నారు. వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఏటా వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి ముడుపులు, మొక్కులు తీర్చుకుంటారన్నారు.

అపూర్వ కలయిక


ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: పి.ఎన్.కాలనీలోని వివేకవర్ధని పాఠశాలలో 2000–01 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగింది. 23 ఏళ్ల తరువాత కలుసుకున్న వీరంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ గత స్మృతులను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. ప్రతి ఏడాది ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసుకొని సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. పూర్వ విద్యార్థులు నరసింహమూర్తి, శివ, డాక్టర్ రఘు, ఆనంద్, రాజమోహన్, స్వాతి, మాలతి, ప్రణీత, లీలారాణి, అమరావతి, కల్యాణి, గణపతి, సురేష్ ఉన్నారు.

నేడు పలు ప్రభుత్వ భవనాల ప్రారంభం

జి.సిగడాం: మండలంలోని పలు గ్రామాల్లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గురువారం పర్యటిస్తారని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సంతవురిటి గ్రామ సచివాలయం భవనం, 4 గంటలకు గెడ్డ కంచరాం పంచాయతీలో హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే కేంద్రాలను ప్రారంభిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

‘కొత్తపరిమళం’ నాటిక నటులకు బహుమతులు


నాటిక ప్రదర్శనలో జిల్లా కళాకారులు

శ్రీకాకుళం కల్చరల్: ఉభయ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు పలు చోట్ల ప్రదర్శించిన ‘కొత్తపరిమళం’నాటికలో నటించిన జిల్లాకు చెందిన నటులు, టెక్నీషియన్లు, దర్శకత్వానికి బహుమతులు లభించాయని రంగస్థల కళాకారులు సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాపట్ల జిల్లా అనంతవరంలో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో బెస్టు విలన్‌గా మెట్ట వెంకటరాజు, గుంటూరు జిల్లా పొనుగుపాడులో ‘అభినయ నాటక పరిషత్’నిర్వహించిన పోటీల్లో ఉత్తమ నటుడుగా మెట్ట పోలినాయుడు, ఉత్తమ విలన్‌గా మెట్ట వెంకటరాజు, ఉత్తమ సంగీత దర్శకుడుగా పి.లీలామోహన్, ఉత్తమ ఆహార్యంలో సింగురు రమణారావు, ఉత్తమ దర్శకుడుగా బి.ఎం.ఎస్.పట్నాయక్‌లు వ్యక్తిగత బహుమతులు అందుకున్నారు. అలాగే ఉత్తమ ప్రదర్శనగా కొత్తపరిమళం నాటికకు బహుమతి వచ్చింది. అలాగే బాపట్ల జిల్లా విరన్నపాలెంలో కళానికేతన్ కళాపరిషత్ నిర్వహించిన పోటీల్లో కొత్తపరిమళం నాటికలో నటించిన మెట్ట వెంకటరాజు ఉత్తమ విలన్‌గా, ఉత్తమ ఆహార్యంలో సింగూరు రమణారావులు వ్యక్తిగత బహుమతులు అందుకొనగా ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా ఈ నాటిక దక్కించుకుంది. వీరిని రంగస్థల కళాకారుల సమాఖ్య తరఫున అభినందించారు.

సీనియర్ అసిస్టెంట్ మృతిపై అనుమానాలు


సతీష్‌కుమార్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఆదివారంపేటలో ఓ సీనియర్ అసిస్టెంట్ మృతిపై అతని సోదరి అనుమానం వ్యక్తం చేస్తూ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు బుధవారం ఫిర్యాదు చేసింది. సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. బొందిలీపురంలోని నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కార్యాలయంలో నారాయణశెట్టి సతీష్‌కుమార్ (50) సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. సతీష్‌కుమార్‌కు 2002లో నరసన్నపేట మండలం దేవాదికి చెందిన మణితో వివాహం జరిగిం వీరికి బీటెక్ చదువుతున్న కుమార్తె, ఇంటర్ చదువుతున్న కుమారుడు ఉన్నారు. వీరంతా ఆదివారంపేటలో నివసిస్తున్నారు. సతీష్‌కు మద్యం తాగే అలవాటు ఉండటంతో భార్య మణితో మనస్పర్థలుండేవి. ఇంటికి వచ్చినా కొన్ని సార్లు బయటే తిని నిద్రపోయేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తొమ్మిదిన్నర గంటలకు ఇంటికి వచ్చిన సతీష్‌కుమార్ భోజనం చేయకుండా బయటే పడుకున్నాడు. వేకువజామున నాలుగు గంటలకు నిద్రలేచిన మణి బయట కొచ్చి చూసేసరికి సతీష్‌కుమార్ అచేతనంగా ఉండటంతో 108కు ఫోన్ చేసింది. సిబ్బంది వచ్చి పరిశీలించగా మృతిచెందినట్లు నిర్ధారించారు. కాగా, దేవాదిలో ఉంటున్న సతీష్‌కుమార్ సోదరి మధులత వచ్చి మృతదేహం చూసి పలు అనుమానాలు వ్యక్తం చేశారు. కాళ్లకింద గాయాలు, భుజాలు కమిలిపోయి ఉండటం గమనించి పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

22న తుది ఓటర్ల జాబితా ప్రచురణ


సమావేశంలో మాట్లాడుతున్న గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన నుంచి గత డిసెంబర్ 9 వరకు వచ్చిన క్లైంల పరిశీలన పూర్తయిందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం గణపతి రావు తెలిపారు. దీంతో ఈనెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురణ ఉంటుందని వెల్లడించారు. రానున్న ఎన్నికలకు సంబంధించి పోలింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. డీఆర్వో చాంబర్ వద్ద గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం 28వ వారపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ డిసెంబర్ తొమ్మిదో తేదీ వరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తి చేశామన్నారు. వాటితో సంబంధం లేకుండా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు దరఖాస్తు చేసుకునే వారి మార్పులు.. చేర్పుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతూ ఉంటుందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఎస్.సత్యనారాయణ, బీజేపీ నుంచి పి.సురేష్‌బాబు, టీడీపీ నుంచి కె.వి.రామరాజు, బీఎస్పీ నుంచి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ


దుస్తులు అందజేస్తున్న డీఎఫ్‌వో వెంకటసాయిరాజేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గ్రూప్–1 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి పార్వతీపురం మన్యం జిల్లా అగ్నిమాపక అధికారిగా నియమితులైన పోలుమహంతి వెంకటసాయిరాజేష్ సంక్రాంతిని పురస్కరించుకుని నగరంలోని అనురాగ నిలయంలో వృద్ధులకు దుస్తులు, ఆహారాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు చేసిన సేవా కార్యక్రమాల పుణ్యఫలంగానే గ్రూప్స్‌లో మంచి ర్యాంకును సాధించగలిగానన్నారు. అనురాగ నిలయంలో మగటపల్లి రమణమూర్తి, నాగాజ్యోతి, ధీరజ్ సౌజన్యంతో వృద్ధాశ్రమంలో వృద్ధులకు, బాల బాలికలు 40 మందికి భోజనాలు, పండ్లు, మిఠాయిలు, నూతన వస్త్రాలను సి.వి.ఎస్.మూర్తి దంపతులు, మంచు ఆనందరావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ ఏవో మనోజ్, ఆదిత్యావాకర్స్ వ్యవస్థాపకులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, సుజాత, విశ్రాంత డీడీ డాక్టర్ పి.జగన్మోహనరావు, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, పి.ప్రభాకరరావు, ప్రశాంత్, వసుమతి, భారతి, కల్యాణి, రమ్య, డాక్టర్ సుకృత, హరిబాబు ఉన్నారు.

స్కూల్‌గేమ్స్ పోటీలకు కోచ్, మేనేజర్ల ఎంపిక

- కోచ్‌గా సతీష్‌రాయుడు, మేనేజర్‌గా రాజశేఖర్ నియామకం


ఆర్.సతీష్‌రాయుడు


జి.రాజశేఖర్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా స్కూల్‌గేమ్స్ అండర్–17 బాలబాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు కోచ్, మేనేజర్లగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (ఫిజికల్ డైరెక్టర్లు) నియామకం అయ్యారు. బాలుర జట్టుకు కోచ్‌గా రాజనాల సతీష్ రాయుడు (జెడ్పీహెచ్ స్కూల్ పాత్రునివలస), మేనేజర్‌గా గురుగుబెల్లి రాజశేఖర్ (జెడ్పీహెచ్ స్కూల్ పిల్లలవలస) నియామకయ్యారు. వీరిద్దరు ఆంధ్రప్రదేశ్ బాలురు జట్లుకు కోచ్ మేనేజర్లగా వ్యవహరించనున్నారు. మధ్యప్రదేశ్‌లోని సుజల్పూర్ వేదికగా ఈనెల 18 నుంచి మొదలుకానున్నాయి. ఈ పోటీల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్‌బాల్ క్రీడాకారుల బృందంతో కలిసి మధ్యప్రదేశ్ చేరుకున్నారు. గతంలోనూ వీరిద్దరు అనేక రాష్ట్ర, జాతీయ పోటీలకు రిఫరీలగా, కోచ్ మేనేజర్లగా వ్యవహరించి ప్రసంశలు అందుకున్నారు. తాజాగా జాతీయ స్కూల్‌గేమ్స్ హ్యాండ్‌బాల్ పోటీలకు కోచ్ మేనేజర్లగా వీరి నియామకం పట్ల డీఈవో కె.వెంకటేశ్వరరావు, ఒలింపిక్ సంఘ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, స్కూల్‌గేమ్స్ సెక్రటరీ బీవీ రమణ, గ్రిగ్స్‌మీట్ సెక్రటరీ కె.మాధవరావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుంకరి కృష్ణకుమార్, ఎమ్మెస్సీ శేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

బైక్ చోరీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట పంచాయతీ కొయ్యరాళ్ల కూడలిలో మంగళవారం అర్ధ రాత్రి బైక్ (బుల్లెట్) చోరీకి గురైంది. ఆర్మీ ఉద్యోగి సత్తారు మనోహర్ బుధవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మనోహర్ తన ఇంటి ఆవరణలో బైక్ పార్క్ చేశారు. తాళం తీయటం మార్చిపోయారు. బుధవారం ఉదయం చూసే సరికి బైక్ లేదు. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com